సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 9 । అక్టోబర్ । 2025



బస్సు కింద పడి యువకుడు మృతి

ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్ అదుపు తప్పడంతో బస్సు కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. - 8లో



ప్రజల భద్రతే.. ప్రథమ కర్తవ్యం

జిల్లా ప్రజల భద్రతే మా ప్రథమ కర్తవ్యం అని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. ప్రజల సహకారమే నేరాలను అరికట్టేందుకు అసలు బలమని ఎస్పీ తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.230
రెండోరకం	రూ.130	రూ.180

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 150 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న డీఈఓ సుబ్రమణ్యం, తదితరులు

రాయచోటి : విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచన దృక్పథం పెంపొందించడానికి చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్ష ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులతో కలిసి చెకుముకి సంబరాల గోడపత్రికను ఆవిష్కరించారు.జిల్లాలోని 8,9,10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు సైన్స్ సంబరాల్లో పాల్గొనేందుకు అర్హులని జిల్లా జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. పాఠశాల స్థాయిలో అక్టోబర్ 18, మండలస్థాయిలో నవంబర్ 1, జిల్లా స్థాయిలో నవంబర్ 23, రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 12, 13, 14వ తేదీల్లో నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రకాష్ రెడ్డి, డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, ఐఈడీ కో–ఆర్డినేటర్ జనార్దన్, ప్రధానోపాధ్యాయులు శివయ్య, రెడ్డన్న పాల్గొన్నారు.

వైవీయూ వీసీగా ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండ



కడప కోటిరెడ్డిసర్కిల్ : యోగి వేమన యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండను నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశా రు. ప్రస్తుతం ఆయన హైదరాబాదు యూనివర్శిటీలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈయన మూడేళ్లపాటు వీసీగా కొనసాగనున్నారు.

ఏఎఫ్‌యూ వీసీగా జయరామిరెడ్డి నియామకం



కడప ఎడ్యుకేషన్ : డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సులర్‌గా బి. జయరామిరెడ్డిని గవర్నర్ అబ్దుల్ నజీర్ నియమించారు. ప్రస్తుతం ఇన్‌చార్జగా వీసీగా విశ్వనాథ్‌కుమార్ పనిచేస్తున్నారు. కాగా జయరామిరెడ్డి ప్రొద్దుటూరు వైవీయూ ఇంజినీరింగ్ కళాశాలలో గతంలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు.

ఆగని రేషన్ దందా..

రేషన్ బియ్యం అక్రమ రవాణాదారులు ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుకుతున్నారు. జిల్లాలో రేషన్ షాపుల నుంచి బియ్యం సేకరించి రైస్ మిల్లుల్లో సాన పట్టించి మార్కెట్లో అమ్మడం ఒక ఎత్తయితే, ఇంకోవైపు రాష్ట్ర సరిహద్దుల్లోని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ మాఫియాకు అధికారం అండ, తోడు కావడంతో వారిని ఆపే ధైర్యం అధికారులు చేయలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి.



అన్నమయ్య నుంచి కర్ణాటక, తమిళనాడుకు తరలింపు

జిల్లాలో మండలాలు	: 30
రేషన్ షాపులు	: 1123
రేషన్ కార్డులు	: 5 లక్షలు
స్మార్ట్ కార్డుల పంపిణీ	: 4.87 లక్షలు.
2025లో (సెప్టెంబర్ ఆఖరి వరకు) అక్రమంగా తరలిస్తున్న వారిపై నమోదైన 6ఏ కేసుల సంఖ్య	: 19
అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన రేషన్ బియ్యం	: 1020 క్వింటాళ్లు

రాయచోటి, రాయచోటి అర్బన్ : పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం ఇస్తున్న రేషన్లోనూ మాఫియా చేతివాటం హద్దులు దాటుతోంది. రేషన్ డీలర్ల నుంచి పేదల ఆర్థిక అవసరాలను అదునుగా తీసుకుని వారి వద్ద నుంచి సేకరిస్తున్న బియ్యాన్ని పక్కనే ఉన్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.అధికారులు అడపాదడపా దాడులు జరిపి కేసులు నమోదు చేస్తున్నా ఆగకుండా మరో చోట దందాను కొనసాగిస్తున్నారు. అక్రమ రేషన్ బియ్యం వ్యాపారానికి రాయచోటి కేంద్రంగా మారుతోంది. వ్యాపారులు డీలర్లు, లబ్ధిదారుల నుంచి బియ్యం కిలో రూ.15–18లకు కొనుగోలు చేసి సమీపంలోని మిల్లర్లకు తరలిస్తున్నారు. అక్కడ దొడ్డు బియ్యాన్ని సాన పట్టి సన్నబియ్యంగా మార్చి లారీల్లో బెంగళూరు, చెన్నై తదితర నగరాలకు తరలిస్తున్నారు. ఈ బియ్యాన్ని రూ.50 వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.



రాయచోటిలో అక్రమ రేషన్ బియ్యం వ్యాపార కేంద్రం వద్ద బస్తాలు

యథేచ్ఛగా అక్రమ వ్యాపారం

జిల్లాలో కూటమి నేతల అండతో అక్రమ రేషన్ బియ్యం మాఫియా రెచ్చిపోతుంది. సేకరించిన బియ్యంలో కిలోకు రూ.4లు స్థానికంగా ఉన్న అధికార పార్టీ నాయకులకు కప్పం కడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో అధికారులు అడ్డుకునే ప్రయత్నాలు చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సివిల్ సప్లై, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా నిర్వహించే దాడుల్లో అక్రమాలు వెలుగు చూస్తున్నా అక్రమ రవాణా ఆగడం లేదు. నాలుగు నెలల కిందట మాసాపేటలోని రైస్ మిల్లులో భారీ స్థాయిలో బియ్యం పట్టుబడినా అధికార పార్టీ నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా వదిలేశారన్న విమర్శలు ఉన్నాయి. అలాగే రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డుకు సమీపంలో ఉన్న షామీర్ కల్యాణ మండలం వీధిలో నిర్వహిస్తున్న అక్రమ రేషన్ వ్యాపార కేంద్రంపై అధికారులు దాడులు నిర్వహించి, బియ్యం సీజ్ చేశారు. అయితే అదే చోట మళ్లీ రేషన్‌బియ్యం అక్రమ వ్యాపారం కొనసాగుతూనే ఉంది. వారిపై 6ఏ కేసులు నమోదవుతున్నా కఠిన చర్యలు లేకపోవడం వల్లే ఇలా జరుగుతోందనే విమర్శలు ఉన్నాయి.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. విజిలెన్స్ అధికారులతో కలిసి దాడులు నిర్వహిస్తున్నాం. అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, ఇతర ప్రాంతాలకు రవాణా చేసిన వారిపై 6ఏ కేసులతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– సుమతి, జిల్లా పౌరసరఫరాల అధికారిణి

నేడు వైఎస్సార్‌సీపీ జిల్లాస్థాయి సమావేశం

– పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి వెల్లడి

రాజంపేట : రాజంపేట మండలంలోని ఆకేపాటి ఎస్టేట్‌లో గురువారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈమేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి బుధవారం మాట్లాడుతూ ఈ సమావేశానికి రీజినల్ కో–ఆర్డినేటర్, శాసనసభ్యుడు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రానున్నారన్నారు. ఆయన ఆధ్వర్యంలోనే జిల్లాస్థాయి విస్తృత సమావేశం కొనసాగుతుందన్నారు. జిల్లాలోని నియోజకవర్గ,పార్లమెంటరీ ఇన్‌చార్జిలు, రాష్ట్ర పార్టీ కార్యవర్గానికి చెందిన నేతలు, ప్రధానకార్యదర్శులు, పీఏసీలు,సీఈసీ, ఎస్ఈసీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శులు, పార్లమెంటరీ స్థాయినేతలు హాజరవుతారన్నారు. అలాగే రాష్ట్ర, జిల్లాస్థాయి అనుబంధసంఘాలకు చెందిన నేతలు, వివిధ క్యాడర్‌లో ఉన్న పార్టీ నాయకులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆకేపాటి పిలుపునిచ్చారు.

ఉపాధిలో తప్పులు చేస్తే ఉపేక్షించేది లేదు

నందలూరు : ఉపాధి పనుల్లో తప్పులు చేస్తే ఉపేక్షించేది లేదని పీడీ వెంకటరత్నం హెచ్చరించారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో బుధవారం 20వ విడత సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఏడాది కాలంలో ఉపాధి, పంచాయతీరాజ్ ద్వారా రూ.5 కోట్ల 55 లక్షల 24 వేల రూపాయల పనులు చేసినట్లు చెప్పారు.అందులో 76 వేల రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయని అన్నారు. ఇందుకు రూ.15,500 అపరాధ రుసుము కూడా విధించినట్లు తెలిపారు.ఓపెన్ ఫోరంలో ఉపాధి, సామాజిక తనిఖీ సిబ్బంది అందరూ పాల్గొని వివిధ పంచాయతీలలో నిర్వహించిన ఆడిట్ వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌టీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఖాళీగా ఉన్న బోటనీ(వృక్షశాస్త్రం) అతిథి లెక్చరర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, నెట్, సెట్,పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళలకు మొదటి అవకాశ కల్పిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 13వతేదీలోగా బయోడేటాను కాలేజీ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఉన్నత విద్యా కమిషనరేట్ నిబంధల ప్రకారం ఈనెల14వతేదీన ఉదయం 10 .30 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అర్హత సర్టిఫికెట్లతో జిరాక్సు, ఒరిజనల్ కాపీలతో నేరుగా హాజరు కావాలని కోరారు.

పేద విద్యార్థుల కడుపుకొట్టేందుకే మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణ

- చంద్రబాబు దళిత వ్యతిరేకి.... కాదనేవాళ్లు చర్చకు రండి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షుడు సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న సుధాకర్‌బాబు

రాయచోటి టౌన్ : పేదవిద్యార్థుల కడుపు కొట్టేందుకే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షుడు సుధాకర్‌బాబు ఆరోపించారు. బుధవారం రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ముందు నుంచే దళితులంటే చంద్రబాబు నాయుడుకు గిట్టదని అన్నారు. మెడికల్ కళాశాలను పీపీపీ విధానంలోకి తీసుకొస్తే పేద విద్యార్థులు నష్టపోవడమే కాకుండా ఉన్నత విద్యకు దూరం అవుతారన్నారు. అందుకే చంద్రబాబు పేద దళిత బిడ్డలు చదవకూడదని ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు దళితుల వ్యతిరేకి అనే విషయం అందరికీ తెలుసన్నారు. కాదనే వాళ్లు చర్చకు వస్తే చర్చించడానికి నేను సిద్ధం అని సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ నేతలను మద్యం కేసులో ఇరికించి బదనాం చేసేందుకు రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డిని అన్యాయంగా జైల్లో పెట్టారని అన్నారు. ఇది కేవలం పెద్దిరెడ్డి కుటుంబంపై ఉన్న రాజకీయ కక్షే కారణమన్నారు. తంబళ్లపల్లెలో దొరికిన నకిలీ మద్యం తయారీదారులు ఎవరు..? వేల కోట్ల ప్రజా ధనాన్ని కొల్లకొడుతున్న దొంగలు ఎవరో... చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రతి మూడు బాటిళ్లకు ఒకటి నకిలీ మద్యం బాటిల్ అమ్ముతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీలకు ఎస్సీలకు, ఎస్టీలకు ఏమి ఇచ్చావో చెప్పాలని నిలదీశారు. వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకొనేందుకు జగనన్న పోర్స్ పేరిట ఒక టీంగా ఏర్పాటు అవుతున్నట్లు చెప్పారు. పోలీసులతో తలలు పగలకొట్టినా, కేసులు పెట్టినా భయపడే ప్రసక్తి లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యే వరకు దళితులు అందరూ కలసి పోరాటాలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు.

ప్రతిభకు కౌశల్!

ఆన్‌లైన్ పరీక్ష తేదీలు

పాఠశాల స్థాయి	: నవంబర్ 1,3,4 తేదీలు
జిల్లా స్థాయి	: 8,9 తరగతులకు నవంబర్ 27న, పదో తరగతికి నవంబర్ 28
రాష్ట్రస్థాయి	: డిసెంబర్ 27



రాష్ట్ర స్థాయిఅవార్డు అందుకున్న బసినికొండ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని, గైడ్ భాస్కరన్(ఫైల్)

మదనపల్లె సిటీ : ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి 'కౌశల్'2025 పోటీలు దోహదపడుతాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల నుంచి కౌశల్–2025 పేరిట రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభ అన్వేషణ పోటీల్లో పాల్గొనేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. భారతీయ విజ్ఞాన మండలి, ఏపీ సైన్స్ సిటీ, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో ఏటా ఈ పోటీలలను నిర్వహిస్తున్నారు.

క్విజ్ పోటీలకు 8,9,10 తరగతుల నుంచి ఒక్కో తరగతికి ముగ్గురు, రెండు నిమిషాల వ్యవధితో కూడిన రీల్స్/ షార్ట్స్ పోటీలకు,పదో తరగతి నుంచి ఇద్దరు, పోస్టర్ తయారీ–1 పోటీలకు 9వ, పోస్టర్–2కు 8వ తరగతి నుంచి ఇద్దరు చొప్పున పాల్గొనాలి. ప్రతిభ కనబరిచిన వారిని ఆయా విభాగాలకు 20 మంది చొప్పున జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. విజేతలను జిల్లా రాష్ట్ర స్థాయిల్లో నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేస్తారు. ఆసక్తిగల విద్యార్థులు పాఠశాల సమన్వయకర్త ద్వారా అక్టోబర్ 24వతేదీ లోపు www.bvmap.org వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కౌశల్–2025 డివిజన్ సమన్వయకర్త భాస్కరన్ తెలిపారు. ఈ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8,9,10 తరగతుల విద్యార్థులు అర్హులు. కౌశల్ పోటీలకు 8,9,10 తరగతుల సిలబస్ నుంచి గణితం, ఫిజిక్స్, నేచురల్ సైన్సులపై ఉంటుంది.

క్విజ్ పోటీల్లో...

రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.12 వేలు, తృతీయ బహుమతిగా రూ.9 వేలు, ప్రోత్సాహక బహుమతిగా రూ.6 వేలు అందజేస్తారు. జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాలకు రూ.4,500, రూ.3,000, రూ.1,500 నగదు ఇస్తారు.

పోస్టర్ ప్రజంటేషన్‌లో...

రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసగా రూ.5 వేలు, రూ. 3 వేలు, రూ.2 వేలు చొప్పున అందజేస్తారు. కన్సోలేషన కింద రూ.1500 చొప్పున అందజేస్తారు. జిల్లా స్థాయిలో ప్రథమ రూ.1500, ద్వితీయ రూ.1000 ఇస్తారు.

వైజ్ఞానిక లఘు చిత్ర పోటీల్లో ...

వైజ్ఞానిక లఘుచిత్ర పోటీల్లో కేవలం 10వ తరగతి విద్యార్థులే పాల్గొనాలి. లఘుచిత్రం నిడివి రెండు నిమిషాలు ఉండాలి. రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2వేలు చొప్పున అందజేస్తారు. ప్రోత్సాహక బహుమతికి కింద రూ.1500 ఇస్తారు. జిల్లా స్థాయిలో ప్రథమ రూ.1500, ద్వితీయ రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి అందజేస్తారు.

పరీక్షల తేదీలు:

పాఠశాల స్థాయిలో నవంబర్ 1,3,4 తేదీల్లో, జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు ఉంటాయి

సద్వినియోగం చేసుకోవాలి

కౌశల్ -2025 పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాలు ప్రోత్సహించాలి. పిల్లల్లో దాగిన ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయి. విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకునేలా ఎంఈఓలు, హెచ్‌ఎంలు కృషి చేయాలి.

– భాస్కరన్, కౌశల్ డివిజన్ సమన్వయకర్త.

కోసినా.. కోయకున్నా... కన్నీరే!

చేతికొచ్చిన పంటను కోత కోయలేరు..
కోసి మార్కెట్‌కు తరలిస్తే కొనేవారే లేరు..
'మద్దతు' పలకాల్సిన పాలకులకా
కర్షకుడి కష్టమే పట్టడం లేదు.
నోటి మాటలు.. వట్టి 'కోత'లు తప్పా!
ఇంకేముంది..
కంటికి రెప్పలా కాపాడుకున్న పంట
కళ్లముందే కుళ్లిపోతోంది.
ఇంటిల్లిపాది పడ్డ కష్టమంతా చేలోనే
బూడిదైపోతోంది!
'ఉల్లి' కోయకుండానే రైతన్న కంట
కన్నీరు పెట్టిస్తోంది.
ఆశల పంటంతా చేలోనే ఆవిరైపోతోంది!!

- గిట్టుబాటు ధర లేక కుదేలైన రైతులు
- క్వింటాల్ రూ. 400 - 500కు పడిపోయిన ధర
- పంటనంతా పొలాల్లోనే వదిలేస్తున్న కర్షకులు



మైదుకూరులోని గొల్లపల్లె వద్ద పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

మైదుకూరు : జిల్లాలో ఉల్లి (పెద్ద బళ్లారి) పంటను సాగుచేసిన రైతులు కుదేలయ్యారు. అసలే గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న రైతులను గోరుచుట్టుపై రోకటి పోటులా వర్షాలు చుట్టుముట్టి దిక్కుతోచని స్థితిలో పడవేశాయి. జిల్లాలో మైదుకూరు, దువ్వూరు, వీరపునాయునిపల్లె, బ్రహ్మంగారిమఠం , ఖాజీపేట, చాపాడు, పులివెందుల తదితర మండలాల్లో 16,668 ఎకరాల్లో రైతులు ఉల్లి పంటను సాగు చేశారు. పంట చేతికి వచ్చే సమయానికి ఉల్లి ధర అమాంతం పడిపోవడంతో రైతుల ఆశలు నేలపాలయ్యాయి. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాల్ ధర రూ. 400 – 500 మాత్రమే పలుకుతోంది. ఎకరాకు రూ. లక్ష పెట్టుబడి పెట్టిన రైతులు క్వింటాల్ ధర పాతాళానికి పడిపోవడంతో తల్లడిల్లిపోతున్నారు. ఆఖరికి పంట కోత కోసి విక్రయించడానికి అయ్యే ఖర్చులు కూడా రాకపోవడంతో చాలామంది రైతులు పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. వీరపునాయని పల్లె మండలంలో వర్షాలకు పంట మునిగిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మైదుకూరు, దువ్వూరు మండలాల్లో పొలాల్లోనే వదిలేసిన ఉల్లి పంటను గొర్రెలు మేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.



గిట్టుబాటు ధర లేక రైతులు పారబోసిన పంటను మేస్తున్న జీవాలు



వర్షానికి దెబ్బతిన్న ఉల్లి పంట

రైతుల కష్టాలపై స్పందించని కూటమి ప్రభుత్వం

గిట్టుబాటు ధర లేక కుదేలైన ఉల్లి రైతుల కష్టాలపై కూటమి ప్రభుత్వం స్పందించకపోవడంపై కర్షకులు కన్నెర్ర చేస్తున్నారు. రైతుల నుంచి క్వింటాల్ రూ.1200 తో కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన అధికారులు ఆచరణలోకొచ్చేసరికి చేతులెత్తేశారు. ఇంతవరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఊసే లేదు. గిట్టుబాటు ధర లేకపోవడం, వర్షాలతో పంట దెబ్బ తినడంతో ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు హెక్టారుకు రూ.50 వేలు పరిహారం చెల్లిస్తామని చంద్రబాబు ప్రకటించారు. అది కేవలం కర్నూలు జిల్లాకు మాత్రమే వర్తిస్తుందని తెలియడంతో జిల్లా రైతులు ఆవేదన చెందుతున్నారు. అటు గిట్టుబాటు ధర లేక ఇటు వర్షాలతో పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా ఉల్లి రైతులు కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోయాను



నేను 5 ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశాను. వర్షంతో పంటంతా దెబ్బతింది. ఎకరాకు రూ.లక్ష ఖర్చయింది. పంట చేతికి వచ్చే సమయంలో రోజూ వాన కురుస్తూ పంట నాశనమైంది. తీవ్రంగా నష్టపోయాను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– దండు మునెయ్య,రైతు, గొల్లపల్లె, మైదుకూరు.

ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తాం



ఎంతో ఆశతో పంటను సాగు చేసిన ఉల్లి రైతులు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారు. కొందరు చేలల్లోనే పంటను వదిలేశారు. రైతులకు యూరియా కూడా సక్రమంగా పంపిణీ చేయని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వం పంటను కొనుగోలు చేసి ఆదుకోవాలి. లేదంటే రైతులతో కలిసి ఆందోళనలు చేస్తాం.

– మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

చేతి కందిన పంట నాశనమైంది



నేను రెండున్నర ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశాను .పంట సాగుకు రూ. 2 లక్షలు పెట్టుబడి అయింది. గడ్డలు బాగా ఊరాయి. మంచి ధర వస్తే కష్టానికి తగిన ఫలితం వస్తుందని ఆశపడ్డాను. తీరా పంట పీకిన తర్వాత జోరున వర్షం పడింది. గడ్డలన్నీ తడిసిపోయాయి. దాంతో పొలం లోనే వదిలేశాను.

– అనకల చిన్న వెంకటరెడ్డి, రైతు, ఓబులాపురం, మైదుకూరు

క్లుప్తంగా

విద్యార్థికి తీవ్రగాయం

బి.కొత్తకోట : చిత్తూరు జిల్లా పలమనేరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని హార్సిలీ హిల్స్ పై బుధవారం రాత్రి జరిగింది. అందిన సమాచారం మేరకు వివరాలు. కళాశాల చెందిన నలుగురు విద్యార్థులు సాయంత్రం హార్సిలీ హిల్స్ వచ్చారు. పర్యాటక అతిథి గృహాన్ని బుక్ చేసుకున్నారు. తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ వివేక్ (19) అనే విద్యార్థి ఎడమ చేయికి తీవ్ర గాయమై మానస సరోవరం వద్ద ఉండగా గుర్తించారు. అక్కడి నుంచి అతన్ని తీసుకొచ్చి విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు ఈ విషయమై విచారించి బాధితుల విద్యార్థి వివేక్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతను ములకలచెరువు మండలం పర్తికోట వాసిగా గుర్తించారు.

ట్రాక్టర్ మిల్లర్ కింద పడి మృతి



ట్రాక్టర్ మిల్లర్ కిందపడి చనిపోయిన జనార్దన్


సంబేపల్లె : కుమారుడికి వివాహం చేశాననే సంతోషం మరువక ముందే తండ్రి ప్రమాద రూపంలో మృత్యుబారిన పడడంతో ఆ ఇంట విషాదం అలుముకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని అడవికమ్మపల్లెకు చెందిన నల్లబోతుల జనార్దన్(54) ట్రాక్టర్ నడుపుతూ జీవం సాగిస్తున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం బుధవారం తన ట్రాక్టర్‌కు మిల్లర్ తగిలించుకొని పనులు చేసుకుంటున్నారు. మిల్లర్ చెడిపోవడంతో మరమ్మతు చేసేందుకు ప్రయత్నించారు. ప్రమాదవశాత్తూ మిల్లర్ మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రికి తరలించే లోపే మృతిచెందారు. ఇంటి యజమాని చనిపోవడంతో భార్య చిలకమ్మ, కుమారులు శేషాద్రి, నాగేంద్ర కన్నీరుమున్నీరయ్యారు. సంబేపల్లె ఎస్ఐ కె.రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టును ఢీకొట్టిన లారీ

గోపవరం : నెల్లూరు – ముంబయి జాతీయ రహదారి (ఎన్‌హెచ్–67)పై ద్వారకా నగర్ సమీపంలో బుధవారం తెల్లవారు జామున కల్వర్టును ఓ లారీ ఢీకొంది. నెల్లూరు నుండి జామాయిల్ కర్ర లోడుతో అనంతపురానికి వెళుతున్న లారీ కల్వర్టును ఢీకొట్టింది. బద్వేల్ మండలం కొత్తచెరువు గ్రామానికి చెందిన డ్రైవర్ ప్రసాద్ ప్రమాదం నుండి తృటిలో తప్పించుకున్నాడు.

ఖాళీ చెక్కుతో కాసుల బేరం

- వడ్డీ వ్యాపారి దెబ్బకు ప్రభుత్వ ఉద్యోగులు విలవిల
- గుర్రప్ప స్వామి ఆటో ఫైనాన్స్ పేరుతో వ్యాపారం
- 300కు పైగా కేసులు వేసిన జింకా రవి, ఆయన అనుచరులు



ఖాళీ చెక్కులో రూ.10లక్షలు బాకీ ఉన్నట్లు రాసిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : సమాజంలో పరువుగా బతికే ఉద్యోగులు భయపడిపోతున్నారు. వడ్డీ వ్యాపారుల వలలో చిక్కి లబోదిబోమంటున్నారు. ఏమి చేయాలో తోచక తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పలేని పరిస్థితి. 2016 నుంచి కొంత మంది అనుచరులను మధ్యవర్తులుగా ఏర్పాటు చేసుకున్న ఓ వ్యాపారి దాష్టీకం ఇది. లక్ష రూపాయలు వడ్డీకి ఇచ్చి ఖాళీ చెక్కులు తీసుకోవడం.. మొత్తం చెల్లించినా.. తర్వాత ఎక్కువ మొత్తం చెక్కులో రాసి కోర్టు ద్వారా అధికంగా సొమ్ము లాక్కోవడం అతడికి ఆనవాయితీగా మారింది. బయటికి చెప్పుకోలేకపోతున్నామన్న ఉపాధ్యాయులు సాక్షితో స్వయంగా తమ అభిప్రాయాలు వెల్లడించారు.

ప్రొద్దుటూరు మండలంలోని దొరసానిపల్లెకు చెందిన జింకా రవి గతంలో శిల్క్ వ్యాపారం చేసేవారు. నష్టాలు వచ్చాయని రూ.40 లక్షలకు 99/2003లో ఐపీ కేసు నమోదైంది. కోర్టు ద్వారా వేలంలో జింకా రవి ఇంటిని కూడా వేరొకరు కొన్నారు. ఈయనే 2016లో గుర్రప్ప స్వామి ఆటో ఫైనాన్స్ పేరుతో వడ్డీ వ్యాపారం ప్రారంభించాడు. పేరుకు మాత్రమే సంస్థ ఏర్పాటుచేశారు కానీ ఎలాంటి రికార్డులు మెయింటెనెన్స్ చేయడం, ప్రభుత్వానికి పన్నులు చెల్లించడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులనే టార్గెట్‌గా చేసుకుని వ్యాపారం సాగిస్తున్నాడు. తీసుకున్న అప్పు కంతుల ప్రకారం చెల్లించినా తన వద్ద ఉన్న ఖాళీ చెక్కులను కోర్టులో వేసి రూ.లక్షకు రూ.10 లక్షలు బాకీ ఉన్నట్లు తన ఇష్టం వచ్చినట్లు ఖాళీ చెక్‌లో రాసుకుని బాకీదారులపై ఒత్తిడి చేసి వసూలు చేస్తున్నాడు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తూ పదవీ విరమణ చెందిన దంపతులు గుర్రప్ప స్వామి ఆటో ఫైనాన్స్‌లో అప్పు తీసుకున్నారు. రూ.లక్షల్లో బాకీ ఉన్నారని వారిపై 15 తప్పుడు కేసులు పెట్టి వేధించారనే ఆరోపణ లున్నాయి. ప్రొద్దుటూరు ఒకటో అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, రెండో అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల పరిధిలో జింకా రవి, ఆయన అనుచరులు వేసిన కేసులు 300కు పైగానే ఉన్నాయనే ఆరోపణలున్నాయి.

రూ.1.50 లక్షలు తీసుకుంటే రూ.36 లక్షలంటూ కోర్టుకు

ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామ పంచాయతీలో నివసిస్తున్న వితంతురాలైన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రూ.50 వేలు ఒక మారు, రూ.లక్ష మరో మారు వడ్డీకి తీసుకున్నారు. ఆమె రూ.3 లక్షలు చెల్లించారు. డబ్బు తీసుకున్న సమయంలో ఉపాధ్యాయురాలు ఇచ్చిన ఖాళీ చెక్కులను ఆధారంగా చేసుకుని రూ.36 లక్షలు బాకీ ఉన్నట్లు కోర్టులో వేశాడు. తన కుమారుడు తిరుపతిలో ట్యాక్సీ నడుపుతుండటంతో అవసరాల కోసం ఆమె అప్పు తీసుకోవడం జరిగింది. గుర్రప్ప ఆటో ఫైనాన్స్ ఎండీ జింకా రవితోపాటు ఆయన అనుచరులు మొత్తం 7 కేసులు వేయగా 4 కేసులు కొట్టేశారు. మిగతా కేసులు విచారణలో ఉండగానే ఆమె చనిపోవడం జరిగింది.

రూ.5 లక్షలకు.. రూ.20లక్షలట..

ప్రొద్దుటూరుకు చెందిన ఓ ఉపాధ్యాయుడు రూ.లక్ష అప్పు తీసుకుని రూ.5 లక్షలు చెల్లించాడు. ఇంకా బాకీ ఉందని ఒత్తిడి చేయడంతో ఆ ఉపాధ్యాయుడు పక్కనున్న మండలానికి బదిలీ చేయించుకున్నారు. ఆయనపై రూ.20 లక్షలకు కోర్టులో కేసు వేశారు. 2019లో కోర్టులో కేసు విచారణ జరుగుతుండగానే తనకు వచ్చిన మెడికల్ బెనిఫిట్ రూ.5 లక్షలు తనకంటే ముందుగానే బ్యాంక్ ద్వారా డ్రా చేసుకున్నాడు. ఈయనపై పెట్టిన రెండు కేసులను కోర్టులో కొట్టివేయడం జరిగింది.

ఖాళీ చెక్కులపై అదనంగా రాసుకుని..

మరో ప్రభుత్వ ఉపాధ్యాయుడు యనమల సుబ్బరాయుడు గుర్రప్ప ఆటో ఫైనాన్స్ కంపెనీలో అప్పు తీసుకుని చెల్లించినా.. ఖాళీ చెక్కులను కోర్టులో వేసి తనకు ఇంకా బాకీ ఉందని కేసులు వేశారు. జింకా రవితోపాటు ఆయన అనుచరులు మొత్తం 7 కేసులు వేశారు. ఇందులో రెండు కేసులు కొట్టివేయగా, ఐదు కేసులు విచారణలో ఉండగానే గుండెపోటుతో ఉపాధ్యాయుడు మరణించాడు. మరో ఉపాధ్యాయుడిపై కూడా నాలుగు కేసులు వేయడం జరిగింది. మరో ఉపాధ్యాయుడు తాను తీసుకున్న డబ్బు చెల్లించినా కోర్టులో కేసు వేయడంతో విధిలేని పరిస్థితిలో ఆయన పక్క నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధిని ఆశ్రయించారు. ఆయన జింకా రవిని పిలిపించి హెచ్చరించడంతో కోర్టులో కేసు విత్ డ్రా చేసుకున్నారు. దీంతో ఆ ఉపాధ్యాయుడు మానసిక వేదన అనుభించాడు.

కోర్టులో కొట్టేసినా..

కె.చంద్రశేఖర్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇచ్చిన ఖాళీ చెక్కుతో రూ.9 లక్షలు చెల్లించాలని 2017 జనవరి 7వ తేదీన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గుర్రప్పస్వామి ఆటో ఫైనాన్స్ తరపున కేసు వేయగా 2019 మే 16న కొట్టేశారు. ఇదిలా ఉండగా తన వద్ద ఉన్న సదరు ఉపాధ్యాయుడి ఖాళీ చెక్కులను ఆసరాగా చేసుకుని రూ.4 లక్షలు చెల్లించాలని 2019 జూన్ 7న, జూలై 17న రూ.2.50 లక్షలకు మొదటి అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో తప్పుడు కేసులు వేయడం జరిగింది. ఓ మహిళా ఉపాధ్యాయురాలికి సంబంధించి 2019 మే 16న ఖాళీ చెక్‌తో దాఖలు చేసిన కేసును కొట్టివేయగా, 2019 మే 31న రూ.4.25 లక్షలకు మళ్లీ కేసు వేశారు. ఈ ప్రకారం గుర్రప్పస్వామి ఆటో ఫైనాన్స్ ఎండీ జింకా రవి తరఫున 2017లో 35 కేసులు, 2018లో 7 కేసులు, 2019లో 17 కేసులు, 2020లో 11 కేసులు వేశారు. జింకా వెంకటసుబ్బయ్య 42 కేసులు, జింకా బ్రహ్మయ్య 26 కేసులు, గుర్రం వెంకటలక్షమయ్య 9 కేసులు, పుల్లగూర చౌడయ్య 30 కేసులు, వద్ది ఓబయ్య 22 కేసులు వేశారు.

ప్రభుత్వ ఉద్యోగులే టార్గెట్

వడ్డీ వ్యాపారి జింకా రవి చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులను టార్గెట్ చేసుకున్నారు. 2016 నుంచి తక్కువ మొత్తం అప్పు ఇచ్చి ఉద్యోగులచే ఖాళీ చెక్కులను ఇప్పించుకుని తమ ఇష్టం వచ్చిన రీతిలో డబ్బు మొత్తాన్ని రాసుకుని కోర్టులో కేసు వేశారు. కోట్ల రూపాయలను అక్రమంగా పొందాలనే ప్లాన్‌తో ఇలా చేశారు. విచారణ జరిగిన కేసుల్లో 20కిపైగా కొట్టివేయడం జరిగింది. జింకా రవి వేసిన కేసుల్లో ఒకటి యదార్థంగా బాకీ ఉన్నట్లు అనిపించడం లేదు. అన్ని కేసులూ తప్పుడు కేసులే. ఒక కేసు కొట్టేశాక అదే వ్యక్తిపై మళ్లీ ఇంకొక కేసు వేశారు.

– ఎన్‌సీ సుమంత్ కుమార్, న్యాయవాది, ప్రొద్దుటూరు

బస్సు డ్రైవర్‌పై ప్రయాణికుల దాడి



డ్రైవర్‌పై దాడి చేస్తున్న యువకులు

రైల్వేకోడూరు అర్బన్ : బస్సు డ్రైవర్‌పై ప్రయాణికులు దాడి చేయడంతో గాయాలయ్యాయి. రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట వద్ద ప్రయాణికులు బస్సుకోసం వేచి యున్నారు. రాజంపేట డిపో ఆర్టీసీ బస్సు తిరుపతికి వెళ్తుండగా.. ప్రయాణికులు బస్సు ఆపారు. డ్రైవర్ బాషా ఆపకుండా పోవడంతో కొందరు యువకులు బస్సును వెంబడించి డ్రైవర్, కండక్టర్లపై దాడి చేసి గాయపరిచినట్లు తెలిసింది. ఇంకా కేసు నమోదు కాలేదు.

బాలిక హత్య కేసులో అనుమానితులకు పాలిగ్రాఫ్ టెస్ట్

జమ్మలమడుగు రూరల్ : గండికోటలో మైనర్ బాలిక హత్య కేసులో అనుమానితులైన కొండయ్య, సురేంద్ర, బాలిక స్నేహితుడు లోకేష్‌లను పాలిగ్రాఫ్ టెస్ట్ కోసం సిఐ నరేష్‌బాబు ఈ నెల 5న విజయవాడకు తీసుకెళ్లారు. గత మూడు రోజులుగా అనుమానితులకు పాలిగ్రాఫ్ పరీక్ష చేస్తున్నట్లు సమాచారం. ఈ నెల 10వతేదీన కోర్ట్ అనుమతి ఉండడంతో హత్య కేసు చిక్కుముడి వీడనుంది. గండికోటలో మైనర్ బాలిక హత్య జూలై 14న జరిగింది. 85 రోజులు అయినా నిందితులు ఎవరినీ పోలీస్ అధికారులు గుర్తించలేదు. సాంకేతిక సాయంతో గుర్తించాలని అగష్టు 26న జమ్మలమడుగు కోర్టులో నిందితులను హాజరుపరచారు. జడ్జి అంగీకరించడంతో ముగ్గురిని విజయవాడకు తీసుకెళ్లారు.

ప్రజల భద్రతే.. మా ప్రథమ కర్తవ్యం

జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



రాయచోటి : జిల్లా ప్రజల భద్రతే మా ప్రథమ కర్తవ్యం అని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సహకారమే నేరాలను అరికట్టేందుకు అసలు బలమని ఎస్పీ తెలిపారు. చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, నీటి కుంటలు, బోర్లు వంటి ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లనీయవద్దని హెచ్చరించారు. సైబర్ క్రైమ్, సోషల్ మీడియా మోసాలపై జాగ్రత్తగా ఉండాలని, పేకాట, కోడి పందేలు, గంజాయి, అక్రమ మద్యం, నాటు సారా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీ షీటర్లు, నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఎక్కడైనా గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గ్రామాలలో అనుమానాస్పద వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రాజస్థాన్ వాసి ఆత్మహత్య

బి.కొత్తకోట : బతుకుదెరువు కోసం రాజస్థాన్ నుంచి బి.కొత్తకోటకు వచ్చిన ఓ వ్యక్తి మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. రాజస్థాన్‌కు చెందిన విక్రమ్ సింగ్ (26) ఆరు నెలలు క్రితం బి.కొత్తకోటకు వచ్చాడు. ఇక్కడ రాజస్థాన్‌కు చెందిన బంధువు గోపాల్ సింగ్ వద్ద పని చేస్తున్నాడు. పోకనాటి వీధిలో అద్దెకు నివాసముంటున్నాడు. కుటుంబ కలహాలు, ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న విక్రమ్ సింగ్ దుకాణానికి మంగళవారం సెలవు కావడంతో రాత్రి ఇంటి వద్ద తాడుతో గొంతుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అన్నతో మాట్లాడేందుకు చెల్లెలు ఫోన్ చేయగా విక్రమ్ సింగ్ తీయక పోవడంతో అనుమానం వచ్చి యజమానికి ఫోన్ చేసి చెప్పింది. అతడు వచ్చి చూసి.. పోలీసులకు సమాచారం అందించారు కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడు...




ధనుంజయ (ఫైల్)

పీలేరురూరల్ : కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం వెలుగుచూసింది. వివరాలిలా వున్నాయి. మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న పి.ధనుంజయ (29) జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఏడేళ్ల కిందట పావనితో వివాహమైంది. అయితే వీరికి పిల్లలు కలగకపోవడం, భార్య భర్తలు తరచూ గొడవపడడం జరిగేది. ఈ క్రమంలోనే వారం క్రితం భార్య వాళ్ల అమ్మగారింటికి వెళ్లింది. ఒంటరిగా ఉన్న ధనుంజయ ఆదివారం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఎస్.రహీం సంఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగు మందు తాగి యువతి..

రాజంపేట : వివాహం చేసుకోవడం ఇష్టం లేక మండలంలోని గుండలపల్లెకు చెందిన కురపాటి భార్గవి(26) ఆత్మహత్యకు పాల్పడినట్లు బుధవారం వెలుగులోకి వచ్చింది. భార్గవి 2023లో బీటెక్ పూర్తి చేసింది. మూడు నెలల కిందట సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి గుడ్‌బై చెప్పి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నేపథ్యంలో తమ కుమార్తెకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు సంబంధాలు చూడడం ప్రారంభించారు. తనకు పెళ్లి ఇష్టంలేదని పదే పదే చెప్పినా వారు వినకపోవడంతో మానసికంగా కుంగిపోయింది. ఈ నెల 6న వ్యవసాయ పనుల కోసం ఉంచిన టాగ్ క్విట్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. రేణిగుంట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 7న మృతిచెందింది. యువతి తండ్రి కురపాల వెంకటరమణనాయుడు పిర్యాదు మేరకు మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మట్లి రాజుల కోట పరిశీలన



కోటను పరిశీలిస్తున్న పురావస్తు అధికారులు

సిద్దవటం : మండలంలోని మట్లి రాజుల కోటను జిల్లా పురావస్తు అధికారులు డాకారెడ్డి, సాయికుమార్ బుధవారం పరిశీలించారు. కోట ముఖ ద్వారం వద్ద కూలినగోడ, మొదటి మండపం, ఈద్గా, డంకా నగర్ రెండోమండపం, దెబ్బ తిన్న నంది విగ్రహం, బయల్పడిన శివలింగం, కామాక్షి గుడి, శిలా శాసనం, రాజ మహల్ వద్ద దెబ్బతిన్న కట్టడాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. వారు మాట్లాడుతూ పడిపోయిన కట్టడాలను పునర్నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. వర్షాలకు రెండో మండపం బయట ఉన్న పురాతన ఆర్చి, రాజమహల్ వద్ద పురాతన గోడ కూలాయన్నారు. వాటికి మరమ్మతులు చేయించడం జరుగుతుందని, రాత్రివేళల్లో సమీప అటవీ ప్రాంతం నుంచి అడవి పందులు వచ్చిర బీభత్స చేస్తున్నాయని, ఈ విషయం అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వీరి వెంట ఎంటీఎస్ సిబ్బంది స్వరూప్ రామ్, గణేష్, ఎన్ఎంఆర్ సిబ్బంది శ్రీను, కరీముల్లా పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి యువకుడు మృతి



ఆస్పత్రిలో విచారిస్తున్న వన్‌టౌన్ పోలీసులు



అతిగా మద్యం తాగి మృతి చెందిన చేనేత కార్మికుడు సుంకరరెడ్డి మృతదేహం



ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందిన వృద్ధురాలు గంగులమ్మ



రంజిత్‌కుమార్ (ఫైల్)

మదనపల్లె రూరల్: ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్ అదుపు తప్పడంతో బస్సు కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె మండలం కుమ్మరపల్లెకు చెందిన చంద్రశేఖర్, రెడ్డిరాణి దంపతుల కుమారుడు కె.రంజిత్‌కుమార్(20) ఇంటర్మీడియట్ పూర్తిచేసి, ప్రస్తుతం మదనపల్లెలో ఓ ఫోటో స్టూడియోలో ఎడిటింగ్ నేర్చుకుంటున్నాడు. ద్విచక్రవాహనంలో మదనపల్లెకు రోజూ వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో బుధవారం ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని బసినికొండ పంచాయతీ వశిష్ట స్కూల్ వద్ద కందూరు నుంచి మదనపల్లెకు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేశాడు. తిరిగి వాహనాన్ని రోడ్డుపైకి మళ్లించే క్రమంలో అదుపుతప్పి వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన రంజిత్‌ను స్థానికుల సమాచారంతో 108లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి రంజిత్ కుమార్ మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళావెంకటరమణ తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జిల్లా ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అతిగా మద్యం తాగి చేనేత కార్మికుడు..

మదనపల్లె రూరల్ : అతిగా మద్యం తాగి చేనేత కార్మికుడు మృతి చెందిన సంఘటన బుధవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. కలకడ మండలం నడిమిచెర్లకు చెందిన నడిపి రెడ్డెప్ప కుమారుడు సుంకర రెడ్డి(42) పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రామిరెడ్డి లే అవుట్‌లో ఉంటున్నాడు. చేనేత కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుమార్తె చైత్రకు వివాహమైంది. గత కొంతకాలంగా సుంకర రెడ్డి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే భార్య జయమ్మ మూడు రోజుల కిందట కుమార్తె, అల్లుడితో కలిసి తిరుమలకు వెళ్లింది. బుధవారం ఇంటికి చేరుకుని భర్తను పలుమార్లు పిలిచినా తలుపు తీయలేదు. పైగా ఇంటి నుంచి తీవ్రమైన దుర్వాసన వెలువడుతుండటంతో అనుమానం వచ్చి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లగా రెడ్డి విగతజీవిగా పడి ఉన్నార్లు. తన భర్త అతిగా మద్యం సేవించి మృతి చెంది ఉంటాడని భార్య జయమ్మ పోలీసులకు తెలిపారు. భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో వృద్ధురాలు..

మదనపల్లె రూరల్: పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ అనంతరం వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె మండలం ఘాజీపేటకు చెందిన గంగప్ప భార్య గంగులమ్మ(60) ఇంటి వద్ద ప్రమాదవశాత్తూ కింద పడి కాలు తుంటి ఎముక విరిగింది. దీంతో కుటుంబసభ్యులు చికిత్సకై ఈ నెల 1న పలమనేరుకు తీసుకెళ్లారు. బాధితురాలికి ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. స్థానిక సొసైటీకాలనీలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఈ నెల 4న ఆరోగ్యశ్రీ అనుమతులు రావడంతో పట్టణంలోని మరో ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. అదే రోజు రాత్రి బాధితురాలు అధికంగా ఆయాసపడుతూ, పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆపరేషన్ తర్వాత బాధితురాలు ఆరోగ్యపరిస్థితిపై పలుమార్లు ఆస్పత్రి సిబ్బంది, వైద్యులకు చెప్పినా నిర్లక్ష్యం కనబరిచారని, దీంతో గంగులమ్మ చనిపోయిందని కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో సీఐ మహమ్మద్‌రఫీ, ఎస్ఐ శివకుమార్ ఆస్పత్రికి చేరుకుని బాధితులు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడి విచారించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

రైల్వేకోడూరు అర్బన్ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్ వద్ద బుధవారం తెల్లవారుజామున బక్కసం మహేంద్ర (20) ద్విచక్ర వాహనంలో వెళ్తున్నాడు. లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై కేసు నమోదు

గాలివీడు : ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం చేసిన బాబాబీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నూలివీడు గ్రామం వడ్లపల్లికి చెందిన రాళ్లపల్లి బాబాబీ ఎస్పీ కార్యాలయంలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి నాగూరువాండ్లపల్లెకు చెందిన రామచంద్ర కుమార్తె శారద వద్ద బంగారం రూపంలో రూ.7లక్షలు, నగదుగా రూ.11.50 లక్షలు తీసుకుంది. మొత్తం రూ.18.50 లక్షలు తీసుకుని ఎలాంటి ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేయడంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. గాలివీడు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి జీవితఖైదు

కడప అర్బన్: హత్య కేసులో ఓ నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని తీర్పునిచ్చారు. సంఘటన వివారాలిలా ఉన్నాయి.. చెట్టివేలి భవాని శంకర్ కడపలో కాంట్రాక్టర్ మల్లికార్జున వద్ద కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేశాడు. అయితే తన భార్యతో మృతుడికి వివాహేతర సంబంధం ఉందని మల్లికార్జున అనుమానించాడు. 2023 నవంబర్, 12న ఉదయం 9 గంటల సమయంలో మల్లికార్జున ఎల్ఐసీ ఆఫీసుకు రమ్మని భవానీ శంకర్‌ను పిలిచాడు. మృతుడు ఆఫీస్ వద్దకు వెళ్ళగానే ఆగ్రహావేశంతో తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నావు" అంటూ వెంట తెచ్చుకున్న మచ్చు కత్తితో విచక్షణా రహితంగా భవానీశంకర్‌ను నరికి చంపాడు. మృతుడి భార్య చిట్టివేలి బాబాబీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ నాగరాజు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. విచారణ అనంతరం నిందితుడికి జీవిత ఖైదు, రూ.100 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారని సీఐ బి.రామక్రిష్ణ తెలిపారు.

బెల్ట్ షాపులు పెట్టి దోచేస్తున్నారు

రాయచోటి టౌన్ : శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకూ బెల్ట్ షాపులు పెట్టి కూటమి నాయకులు ప్రజల సొమ్ము దోచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ పేదలను మద్యానికి బానిసలను చేస్తూ రూ.5 ఖర్చు చేసి బాటిల్, స్టిక్కర్ పెట్టి తయారు చేసిన నకిలీ మద్యాన్ని బాటిల్ రూ.100 చొప్పున అమ్ముతున్నారన్నారు. కుటీర పరిశ్రమల్లా నకిలీ మద్యం తయారు చేస్తూ తెదేపా నాయకులు దోచుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి లిక్కరు వస్తే రాష్ట్రంలో కేసులు పెట్టే పరిస్థితి గతంలో ఉండేదని, ఇపుడు సొంత రాష్ట్రంలోనే నకిలీ మద్యం పట్టుబడుతున్నాయని ఆరోపించారు. ఉచితం పేరుతో ఇసుకను పక్క రాష్ట్రాలకు తరలించి కూటమి నాయకులు ఆదాయం ఆర్జిస్తున్నారన్నారు.

విద్యార్థిపై దాడి సంఘటనపై విచారణ



విలేకరులతో మాట్లాడుతున్న శేషాద్రి రెడ్డి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు

లక్కిరెడ్డిపల్లి : ఫీజు చెల్లించలేదని బి.కొత్తకోట రిషీవాటిక గురుకులం విద్యార్థి శేషాద్రిరెడ్డిపై రాయితో దాడి చేసిన సంఘటనపై ఉన్నతాధికారులు బుధవారం విచారణ నిర్వహించారు. సాక్షిలో ప్రచురితమైన విద్యార్థిపై దాడి....ఘటనపై వారు స్పందించారు. అన్నమయ్య జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ లక్ష్మీ నరసయ్య చేరుకుని విద్యార్థికి వైద్య పరీక్షలు జరిపారు. అనంతరం మీడియా సమావేశంలో శేషాద్రిరెడ్డి తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమారుడిపై బోధనేతర సిబ్బంది వెంకటేష్ దాడి చేసి నెల రోజులవుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమారుడి కుడి కన్ను పూర్తిగా దెబ్బతిందని, పోలీసులు పాఠశాల యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. అన్యాయంపై ప్రశ్నిస్తుంటే తమను చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. శేషాద్రి రెడ్డి కేసును జిల్లా యంత్రాంగం నీరుగారుస్తోందని కన్నీటి పర్యంతమయ్యారు. వెంకటేష్‌ను అరెస్టు చేసే వరకూ న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. మదనపల్లి పోలీసులు తమను కోర్టుకు హాజరుకావాలని నోటీసులు జారీ చేశారన్నారు.

బెల్టు నిర్వాహకుడి అరెస్టు

రాజంపేట : పట్టణంలో బెల్టుషాపులు లేకుండా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని రాజంపేట అర్బన్‌సీఐ నాగార్జున అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని బ్రహ్మంగారి గుడికి ఎదురుగా కొత్తమిషన్ వీధిలో బెల్టుషాపు నిర్వాహకుడు సింగమాల గంగాధర్‌ను అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి 33 బ్రాందీ సీసాలు సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. పట్టణంలో ఎవరైనా బెల్టుషాపు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. వారికి సహకరించే వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏఎస్ఐ వర్మ, హెడ్ కానిస్టేబుల్ హరి, సిబ్బంది పాల్గొన్నారు.